# భారతదేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య రాజ్య స్వభావ సామాజికార్థిక రాజకీయ విశ్లేషణ

ఈ పత్రాన్ని రెండేళ్ల క్రితం సిపిఐ (ఎం-ఎల్) కామ్రేడ్ ఒకరు రాసారు. దీన్ని ఉపయోగకరమైన మంచి ప్రయత్నంగా మేము భావిస్తున్నాము. కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రసిద్ధ పుస్తకం 'తాకట్టులో భారతదేశం' మరియు కొన్ని సర్వేల నివేదికల నుంచి సేకరించిన వివిధ వాస్తవాలు, గణాంకాలు, విశ్లేషణలను సంక్షిప్తీకరించి ఈ పత్రం రాసారు. ఈ సంచికలో ఈ పత్రం ఒకటవ భాగం ఇస్తున్నాం. మిగిలిన భాగాలు తరువాతి సంచికలలో ప్రచురిస్తాం. – సంపాదకులు

**ముందుమాట**

బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తులు భారత పాలకులకు రాజ్యాధికారాన్ని బదలాయించిన 1947 నాటి నుండి 74 సుదీర్ఘ సంవత్సరాలు గడిచినప్పటికీ భారతదేశం అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశం కాలేకపోవడం మన దేశ శ్రామిక జనావళికి ఎంతో ఆందోళన కలిగించే విషయం. సహజ వనరులు, మానవ వనరులు, మేధో సంపదల కొరత ఏమీ లేనప్పటికీ అభివృద్ధి చెందకుండా వుండిపోవడమే గాక ఆహారము, దుస్తులు, గృహవసతి, విద్య, వైద్యము వంటి కనీస అవసరాలు కూడా మన దేశ శ్రామిక ప్రజలకు తీరని పరిస్థితి నేటికీ వుంది. మరి వెనుకబాటుతనానికి వాస్తవ కారణాలేమిటి? సమస్య ఎందులో వుంది?

మన దేశ రాజ్య స్వభావంలో సమస్య ఇమిడి వుంది. 1947లో బ్రిటీష్ వలస పాలకుల నుండి అధికారం బదిలీ చేసుకున్న మన దేశ దోపిడీ వర్గం అధికార దాహం కలిగినదీ, అత్యంత స్వార్థపూరితమైనదే గాక సామ్రాజ్యవాద శక్తుల తొత్తులయిన, రాజకీయంగా కాంగ్రెస్ పార్టీగా నిర్మాణమయిన దళారీ పెట్టుబడిదారీ మరియు బడా భూస్వామ్య వర్గాల తొత్తు కూడా. దేశంలోని ఈ దోపిడీశక్తుల మరియు విదేశీ సామ్రాజ్యవాద శక్తుల అనుసంధానం మూలంగా మన దేశం పెద్దఎత్తున దీర్ఘకాలం పాటు దోపిడీకి గురై అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశముగా మిగిలిపోయింది. 1947లో స్వాతంత్ర్యం అనబడేది సాధించుకున్న 74 సంవత్సరాల తరవాత కూడా మన దేశం పేదరికపు, అభివృద్ధి లేని వెనుకబడిన దేశంగా మిగిలిపోవడానికి సారాంశంలో అదే కారణం.

భారతదేశ అర్ధవలస రాజ్య స్వభావాన్ని చర్చించే ముందు మనం తొలుత అర్ధవలస రాజ్య స్వభావాన్ని గురించి చర్చించుకుందాం. ఈ విషయమై కా॥ లెనిన్ అందించిన వివరణలు, విశ్లేషణలు సోదర కమ్యూనిస్టులందరికీ కూడా అత్యంత ప్రాసంగిక, ఆమోదయోగ్య నిర్వచనాలుగా వుంటాయి. కావున ఆ వైపున ముందుకు సాగుదాం.

తన ప్రఖ్యాత గ్రంథం "సామ్రాజ్యవాదము : పెట్టుబడిదారీ అత్యున్నత దశ"లో ఈ విషయంపై మరియు అర్ధవలస వాదము గురించి కా॥ లెనిన్ అత్యంత సమగ్రమయిన, విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు. కావున వాటిని అధ్యయనం చేయాల్సి వుంది.

కా॥ లెనిన్ ఇలా రాసాడు : "గుత్తాధిపత్య సంస్థలు, ద్రవ్య పెట్టుబడి ఆధిక్యత స్థిరపడినప్పుడు, పెట్టుబడి ఎగుమతి అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నప్పుడు, అంతర్జాతీయ ట్రస్టుల మధ్య ప్రపంచ విభజన మొదలైనప్పుడు, అతిపెద్ద పెట్టుబడిదారీ శక్తుల మధ్య భూగోళం మీది అన్ని ప్రాంతాల విభజన పూర్తయినపుడు అటువంటి అత్యున్నత పెట్టుబడిదారీ దశే సామ్రాజ్యవాదం" (Imperialism : The Highest Stage of Capitalism)

ద్రవ్య పెట్టుబడి నడకను గురించి లెనిన్ ఇంతకు ముందే వివరించి వున్నారు : "ద్రవ్య పెట్టుబడి అన్ని ఆర్థిక, అన్ని అంతర్జాతీయ సంబంధాల్లోను ఎంత పెద్ద, ఇంకా చెప్పాలంటే ఎంత నిర్ణాయక శక్తి అంటే అది పూర్తి రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న రాజ్యాలను కూడా తనకు లోబరుచుకోగల్గిన, నిజంగానే లొంగదీస్తున్న పరిస్థితి నెలకొని వుంది. ఇట్టి ఉదాహరణలను త్వరలో చూద్దాం. లొంగిపోయిన దేశాలు, ప్రజలు స్వాతంత్ర్యం కోల్పోయిన మేరకు అటువంటి లొంగుబాటు నుండి ద్రవ్య పెట్టుబడి గరిష్ట లాభాలను గుంజుకోవడంలో మరింత వెసులుబాటు వుండడాన్ని గుర్తిస్తుంది. ఈ సందర్భంగా అర్ధవలస దేశాలు, మధ్య దశకు ఉదాహరణలుగా నిలుస్తాయి. సహజంగానే అప్పటికే తక్కిన ప్రపంచమంతా విభజించుకోబడిన పరిస్థితుల్లో ఈ అర్ధవలస దేశాలపై పట్టుకోసం ద్రవ్య పెట్టుబడిదారీ యుగంలో తగవులాట మరింత నిశితమవుతుంది."

సామ్రాజ్యవాద రాజ్యాలు ప్రపంచ పునర్విభజనపై జరిపిన ఒకటవ, రెండవ ప్రపంచ యుద్ధాలను మనం చూశాం. ఒకటవ ప్రపంచ యుద్ధం తరవాత విజేతలయిన రాజ్యాలు, పరాజిత రాజ్యాల నుండి డబ్బు లాక్కొని పోటీ నుండి వాటిని

తరిమివేయాలని ప్రయత్నించాయి. అదే సందర్భంలో సోషలిస్టు రాజ్యమైన యుఎస్ఎస్ఆర్ పుట్టుకు రావడంతో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసింది. అప్పటి వరకు వలసలు, అర్థ వలసల్లోని జాతీయోద్యమాలు బలహీనంగా వుండినాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో పరాజయం పొందిన సామ్రాజ్యవాద దేశాలు యాక్సిస్ కూటమిగా ఏర్పడి అత్యంత దురాక్రమిత రెండవ ప్రపంచ యుద్ధాన్ని మొదలిడినాయి. ఇతర సామ్రాజ్యవాద దేశాలు మొదట్లో ఆ యుద్ధాన్ని యుఎస్ఎస్ఆర్ పైకి మళ్ళించడానికి ప్రయత్నించి విఫలమయినాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంగా మారింది. అదే సందర్భంలో ప్రపంచవ్యాప్తంగా జాతీయ ఉద్యమాలు అభివృద్ధి చెందినాయి. ఆ యుద్ధంలో మిత్రదేశాలు (Alied Forces) విజయం పొందినాయి. (కా॥ స్టాలిన్ నాయకత్వంలో యుఎస్ఎస్ఆర్ మూలంగానే అది సాధ్యమయింది) అయితే అమెరికా సామ్రాజ్యవాదులు తప్ప తక్కిన సామ్రాజ్యవాద దేశాలు చాలా బలహీనపడడమే గాక వారి వలసల్లో జాతీయోద్యమాల ఆగ్రహాన్ని చవిచూడవలసి వచ్చింది. అంతేగాక చైనా మరియు తూర్పు ఐరోపా దేశాల్లో విప్లవ విజయాలతో బలమైన సోషలిస్టు శిబిరం ముందుకొచ్చింది. అటువంటి పరిస్థితుల్లో సామ్రాజ్యవాద శక్తులకు రెండు ఎంపికలు మాత్రమే మిగిలాయి. ఒకటి జాతీయోద్యమాలను అణచివేసి వలసలను అట్టి పెట్టుకోవడానికి ప్రయత్నించడం. ఇది ద్రవ్య పెట్టుబడికి మిక్కిలి అనుకూలమైన మార్గం. రెండు, అధికారాన్ని జాతీయ శక్తులు లాగేసుకోకముందే ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చే దళారీ శక్తుల చేతుల్లోకి తమ అధికారాన్ని బదలాయించడం. తద్వారా ప్రత్యక్ష పాలన బదులు సామ్రాజ్యవాదుల పరోక్ష పాలన యధావిధిగా కొనసాగుతుంది. మొదటి మార్గం సామ్రాజ్య వాదులను సమూలంగా పీకి పారదోలడానికి దారితీస్తుంది కాబట్టి రెండవ మార్గాన్ని వారు ఎంచుకున్నారు.

ఈ విధానంలో మార్పు సామ్రాజ్యవాద దోపిడీ స్వభావాన్ని ఏమీ మార్చలేదు. ఇది కొత్త రూపంలో వలస పాలన మాత్రమే. రాజ్యాధికారాన్ని ప్రత్యక్షంగా నెరపకుండా శిక్షణ పొందిన తన ఏజెంట్ల ద్వారా, కొన్ని సందర్భాల్లో తన తొత్తుల ద్వారా సాగించింది. వలస పాలన యొక్క ఈ కొత్త రూపాన్నే నయా వలస విధానమనీ ఈ కొత్త రకం పాలనని నయా వలస పరిపాలన అనీ వ్యవహరిస్తాం. గ్రేట్ డిబేట్ సందర్భంలో "నయా వలస విధాన సమర్థకులు" అను వ్యాసంలో చైనా కమ్యూనిస్టు పార్టీ దీన్నంతటినీ స్పష్టంగా వివరించింది. అందులో ఇలా రాసారు : "వాస్తవాలు స్పష్టంగానే వున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరవాత సామ్రాజ్యవాదులు వలస విధానాన్ని ఏ మాత్రం వదులుకోలేదు. నయా వలసవాదం అను కొత్త రూపాన్ని చేపట్టారు. నయా వలసవాదం యొక్క ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే కొన్ని ప్రాంతాల్లో సామ్రాజ్యవాదులు పాత వలస పాలన పద్ధతిని మార్చుకొనే విధంగా నెట్టబడ్డారు. తాము ఎంపిక చేసి శిక్షణ ఇచ్చిన ఏజెంట్లపై ఆధారపడి సాగించే కొత్త రకం వలస పాలనను అనుచరించారు".

సామ్రాజ్యవాదం యొక్క వలసవాద విధానం సారంలో ఏమీ మారలేదనీ, రూపం మాత్రమే మార్చుకుందనీ అర్థమవుతుంది. సారంలో ఎందుకు మార్పులేదంటే పరోక్ష పాలనలో కూడా సంపూర్ణ లొంగుబాటుకు ప్రయత్నిస్తారు. అంటే అధీన దేశాలు రాజకీయ స్వాతంత్ర్యం కోల్పోతాయి. (అలోక్ ముఖర్జీ రచన "వలస-నయా వలస-అర్థవలస" నుండి)

పైన వివరించిన చర్చ ఆధారంగా సామ్రాజ్యవాదం యొక్క నయా వలస విధానం రూపంలోనూ సారంలోనూ భిన్నంగా వుందని అర్థమవుతుంది. ప్రత్యక్ష వలస పాలన సాగిన కాలంలో కూడా అటువంటి పాలన కింద లేని కొన్ని దేశాలు కూడా ద్రవ్య పెట్టుబడి వలలో ఇరుక్కుపోయి ఊపిరాడని స్థితిలోకి నెట్టబడినాయి. అంటే వలస, నయా వలస అది ఏదయినా దోపిడీయే సామ్రాజ్యవాదం యొక్క అంతస్సారం. ప్రజాస్వామ్య సిద్ధాంతాల వల్లెవేతలు కేవలం మానవీయ ముఖాన్ని ప్రదర్శించడం కోసం మాత్రమే (బాహ్యసారం). రూపాన్ని మార్చి సారాన్ని అట్టిపెట్టే ఈ విధానాన్ని సామ్రాజ్యవాదులు నిర్వలసీకరణగా పేర్కొంటారు.

ఈ సందర్భంలో కా॥ లెనిన్ చేసిన మరికొన్ని ఉద్ఘాటనలను పరిశీలిద్దాం : "ఈ యుగం ప్రత్యేకత వలసలు, వలస పాలకులు అను రెండు ప్రధాన రకాల దేశాలే గాక పలు రకాల పరాధీన దేశాలు కూడా వుండటం. అవి అధికారికంగా, రాజకీయంగా స్వతంత్రమైనవైనా నిజానికి ఆర్థిక, దౌత్య వలలో ఇరుక్కొని వుంటాయి. అర్థవలస మనమిదివరకే సూచించిన ఒక రకపు పరాధీనత". (సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ అత్యున్నత దశ)

"మధ్యంతర అర్థవలస దేశాలు ప్రకృతికి, సమాజానికి చెందిన అన్ని రంగాల్లోను కనపడే పరివర్తనా రూపాలకు ఒక ఉదాహరణ".

"ఈ సందర్భంలో అర్థవలస దేశాలు మధ్యంతర పరివర్తనా దశకు మంచి ఉదాహరణలుగా నిలుస్తాయి".

'పరివర్తనా రూపము' మరియు 'మధ్య దశ' అంటే అర్థం ఏమిటి? వాటి అర్థం ఏమిటంటే నయా వలస దేశాలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోయే స్థితిని చేరలేదు. కోల్పోయే దశలో సాగుతున్నాయి. అవి మధ్య దశలో ఎందుకున్నాయంటే అవి పూర్తి స్వతంత్రంగానూ లేవు లేదా పూర్తి అధీనతలోనూ లేవు. పరివర్తనా రూపం యొక్క మరొక అర్థంలో స్వతంత్రను కోల్పోయే క్రమంలో పరాధీనతా స్థాయి భిన్న దశల్లోను, భిన్న సందర్భాల్లో భిన్నంగా వుండవచ్చు. అంతేగాక ఈ దశల్లో ఆయా దేశాలను లొంగదీసుకోవడానికి వివిధ సామ్రాజ్యవాద శక్తులు వాటిలో అవి పోటీబడతాయి. లెనిన్ ఈ విషయం స్పష్టంగా చెప్పాడు. "ఇతర ప్రపంచమంతా అప్పటికే పంచుకోబడినందువల్ల

సహజంగానే అర్ధ స్వతంత్ర దేశాలను తమ గుప్పిట్లోకి తెచ్చుకొనే ఆధిపత్య పోరాటం ద్రవ్య పెట్టుబడి యుగంలో ప్రత్యేకించి కటువైనదిగా కలిగి వుంటుంది".

వాస్తవంగా అర్ధవలస దేశాలను ఏకచ్ఛత్రాధిపత్యం కిందకి తెచ్చుకోవడానికి వివిధ సామ్రాజ్యవాద దేశాలు ఒకదానితో మరొకటి పోటీబడతాయి. మన భారతదేశంలోనే అటువంటి పోటీ అమెరికా నాయకత్వాన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు, మరియు సోవియట్ సోషలిస్టు సామ్రాజ్యవాదులకు మధ్య జరగడం చూశాం. 1960ల ఉత్తరార్థంలోను, 1970ల పూర్వార్థం లోను సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు ఇండియాలో దాదాపు వారి ఏకీకృత ఆధిపత్యం కిందకు తెచ్చుకున్నారు. పోటీ శిఖర స్థాయికి చేరి అంతర్గత ఎమర్జెన్సీని ప్రకటించినప్పుడు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు దాన్ని స్వాగతించినారు. అటువంటి దేశాల్లో నిరంకుశాధికార బడా బూర్జువా వర్గం దళారీ స్వభావాన్ని కలిగి వుంటుంది. ద్రవ్య పెట్టుబడి పట్టు నుండి తప్పించుకోగల శక్తి వారికి వుండదు. తప్పించుకొనే ఉద్దేశం లేనందువల్ల కాదు. సామ్రాజ్యవాదపు ద్రవ్య పెట్టుబడితో పోటీపడగల పెట్టుబడి వారికి లేదు. ఒక విధంగా వారి ఉనికి, పెరుగుదల ద్రవ్య పెట్టుబడి మీద ఆధారపడి వుంటుంది. ఎఫ్‌డిఐ, ఎఫ్ఐఐ లేదా విదేశీ బ్యాంకులయిన డాయిష్ బ్యాంక్, మోర్గాన్, క్రెడిట్ సూయిస్, స్టాండర్డ్ చార్టర్ట్ గోల్డ్‌మన్ సాక్స్ మొదలైన వాటి నుండి బడా బూర్జువాజీకి అందిన రుణాల ద్వారా ద్రవ్య పెట్టుబడి ప్రవేశిస్తుంది. అర్థవలస రాజ్యాలు పరివర్తనా రకానివి కావడం మూలంగా వాటి పరాధీనత అన్నది రాజ్యాల మధ్య తేడాలను కలిగి వుంటుంది. (పై రెండు పేరాలు అలోక్ ముఖర్జీ రచనలోవి.)

కావున స్పష్టమయేది ఏమిటంటే అర్ధవలస దేశాలు రాజకీయ స్వాతంత్ర్యం కలిగి వున్నప్పటికీ ఆర్థికంగా సామ్రాజ్యవాదంపై ఎంతగా ఆధారపడి వున్నారంటే క్రమంగా సామ్రాజ్యవాద పెట్టుబడిలో చిక్కుకొని క్రమక్రమంగా స్వాతంత్ర్యాన్ని కోల్పోయే దిశగా సాగుతాయి.

పైన పేర్కొన్న కా॥ లెనిన్ ఉటంకింపులు, 2వ ప్రపంచ యుద్ధం తర్వాత నెలకొన్న స్థితిగతుల పరిశీలన ద్వారా సామ్రాజ్యవాద దోపిడీ విధానము, అదే విధంగా అర్ధవలస దేశాల లక్షణాలు ఈ కింది విధంగా వున్నాయి:

**1వ లక్షణం :** రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో దాని క్షీణ మృతప్రాయ దశలో సామ్రాజ్యవాదం అభివృద్ధి చెందని వెనుకబడిన దేశాలకు ద్రవ్య పెట్టుబడిని ఎగుమతి చేసే విధానాన్ని చేపట్టింది. ఇది దాని యొక్క అత్యంత లాభసాటి, సమర్ధవంతమైన దోపిడీ విధానాల్లో ఒకటి.

**2వ లక్షణం :** అర్థవలస దేశాల్లో సామ్రాజ్యవాదులు ప్రత్యక్ష పాలనకు బదులుగా రాజ్యాధికార పగ్గాలను తాము శిక్షణ ఇచ్చిన విశ్వాసపాత్రమైన ఏజెంట్ల చేతుల్లో పెడుతుంది.

**3వ లక్షణం :** తాము శిక్షణ ఇచ్చిన ఏజెంట్ల చేతుల్లోకి వెనుకబడిన దేశాల బూర్జువా వర్గం సామ్రాజ్యవాదానికి అత్యంత నమ్మకమైన ఆధారపడదగిన సహచరుడుగా వుంటుంది. ఎందుకంటే వాళ్ళు సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి జన్మించిన శిశువులు. వాళ్ళు సామ్రాజ్యవాదానికి ఎల్లవేళలా విశ్వాసపాత్రులుగా వుంటారు. అందుకే ఈ బూర్జువా వర్గం మొదలంటా దళారీ స్వభావాన్ని కలిగి వుంటుంది. అంతకంతకూ అధిక పెట్టుబడి కూడగట్టడంలో వున్న వారి స్వార్ధపూరిత ప్రయోజనం సామ్రాజ్యవాద పెట్టుబడి యొక్క దోపిడీ క్రమంతో ముడిపడి వుంటుంది.

**4వ లక్షణం :** రాజకీయ స్వాతంత్ర్యం వున్నప్పటికీ ఈ వెనుకబడిన అభివృద్ధి పరచుకొనే ప్రయత్నంలో విదేశీ అప్పుల కోసం చొరవజేస్తూ సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి వలలో ఇరుక్కుపోతాయి. దీని ఫలితంగా ఆర్థిక సంక్షోభంతో కూరుకుపోయి క్రమంగా రాజకీయ స్వాతంత్ర్యాన్ని కోల్పోతాయి.

ఇండియా యొక్క సామాజికార్థిక రాజకీయ దృక్కోణాన్ని పరిశీలించే సందర్భంలో పై నాలుగు లక్షణాలను విశ్లేషించడం తార్కికమైనది. తద్వారా ఇండియా రాజ్య స్వభావం అర్ధవలసకు చెందినదా కాదా అను నిర్ధారణ దానికదే తేలిపోతుంది.

ఆ విధంగా మన దేశంలో బ్రిటిష్ పాలన కాలం నుండీ మనకు అందుబాటులో వున్న వాస్తవాలు, గణాంకాలు, చారిత్రక సాక్ష్యాల ఆధారంగా పై నాలుగు లక్షణాలను ఒక దాని తరవాత ఒకటి విశ్లేషిద్దాం :

**1వ లక్షణం విశ్లేషణ :** రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో దాని మృతప్రాయ క్షీణ దశలో సామ్రాజ్యవాదం అభివృద్ధి చెందని వెనుకబడిన దేశాలకు ద్రవ్య పెట్టుబడిని ఎగుమతి చేసే విధానాన్ని చేపట్టింది. ఇది దాని యొక్క అత్యంత లాభసాటి సమర్ధవంతమైన దోపిడీ విధానాల్లో ఒకటి.

2వ ప్రపంచ యుద్ధం తరవాత సామ్రాజ్యవాదులు వారి పాత పద్ధతి అయిన ప్రత్యక్ష వలస పాలన, దోపిడీ విధానాలను మార్చుకొనే దిశలోకి నెట్టబడ్డారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాల్లో కొందరు ఏజెంట్లపై ఆధారపడి దోపిడీ సాగించే కొత్త విధానాన్ని చేపట్టారు. "ఆర్థిక సహాయం" పేరుతో ప్రత్యక్ష పెట్టుబడుల వంటి ఇతర రూపాల ద్వారా వాళ్ళ సరుకులకు మార్కెట్‌ను కల్పించుకోవడానికి, వాళ్ళ పెట్టుబడిని ఎగుమతి చేసుకొనే మార్గాల కోసమూ, ముడిసరుకుల వనరుల కోసమూ, సంపదలను కొల్లగొట్టి ప్రజల రక్తం పీల్చడానికి ఈ దేశాలను నిలుపుకోవడానికి సామ్రాజ్యవాదులు సకల ప్రయత్నాలు చేస్తారు. ఈ కొత్త వలసవాదం పాత రూపంలోని వలసవాదం కంటె మరింత హానికరమైన, ప్రమాదకరమైన రకం. పూర్వపు వలసల ప్రజలను యధాతథంగా దోపిడీకి గురిచేయడానికి సామ్రాజ్యవాదులు కొత్త రూపాలను, కొత్త విధానాలను, అన్ని రకాల ఆర్థిక నియంత్రణ ద్వారా వాళ్ళ పట్టును నిలుపు

కోవడానికి, విస్తరించుకోవడానికి, దృఢతరం చేసుకోవడానికి వాళ్ళు ప్రయత్నిస్తారు.

ప్రైవేట్ మరియు ప్రభుత్వ పెట్టుబడిని ఎగుమతి చేయుటలో సామ్రాజ్యవాదం పూర్వపు వలసలను తన పట్టులో బిగించడానికి అవలంబించే సరికొత్త ప్రధానమైన ప్రణాళిక ఏదంటే "సహాయం" రూపంలో పెట్టుబడి ఎగుమతి. కా॥ లెనిన్ అన్నట్లు "సరుకుల ఎగుమతి స్థానంలో పెట్టుబడి ఎగుమతి అసాధారణ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది".

"సహాయం" అన్నది లాభాపేక్షలేని అంతర్జాతీయ దాతృత్వ చర్య అను అభిప్రాయం ఒకటి ప్రచారంలో వుంది. ప్రభావం నెరపి నియంత్రించే ఆయుధంగా దాని పాత్రకు స్పష్టమైన ఆధారాలుండగా తద్విరుద్ధంగా ఈ అభిప్రాయాన్ని ప్రచారం చేసేవారు ప్రజలను మోసగిస్తున్నారు. "సహాయం" (Aid) నిర్వహించే పాత్ర గురించి ఏమీ దాపరికం లేకుండా ప్రెసిడెంట్ కెన్నడి 1961లో ఇలా అన్నాడు : "విదేశీ సహాయం అన్నది ప్రపంచమంతటా అమెరికా తన ప్రభావాన్ని, నియంత్రణను నెలకొల్పే ఒక సాధనం. చాలా దేశాలు కమ్యూనిస్టు కూటమిలోకి అనివార్యంగా జారిపోకుండా అది నిరోధిస్తుంది." కావున "సహాయం" అన్నది దాన్ని తీసుకున్న దేశాలపై ప్రభావము, నియంత్రణ నెరపడానికీ, ఆ దేశాల ప్రభుత్వాలు పడిపోకుండా నిలబెట్టడానికీ, అంటే ఆ దేశాల పాలక వర్గాలను బలం పుంజుకుంటున్న విప్లవ శక్తుల నుండి కాపాడడానికీ అది ఒక సాధనంగా పని చేస్తుంది. గతంలో USAID (United States Agency for International Development)లో సీనియర్ ఆర్థికవేత్తగా పనిచేసిన వ్యక్తి ఇలా అంగీకరించారు : "ఏ దేశాల్లో అయితే ప్రస్తుత ప్రభుత్వాల మనుగడ మాకు ప్రయోజన కరమైనదో అక్కడ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు దిగజారి పోకుండా ఆర్థిక సహాయం అందించడం మా విదేశాంగ విధానంలో ఒక సాధనం."

1920 జూన్‌లో కా॥ లెనిన్ ఇలా వ్యక్తం చేశాడు : "నిజానికి సామ్రాజ్యవాదులపై ఆర్థికంగా, ద్రవ్యపరంగా, సైనికంగా పూర్తిగా ఆధారపడిన, రాజకీయంగా స్వతంత్రమైనవని గొప్పలు పోయే కొన్ని పరాధీన దేశాల్లోని సంపన్న పాలక వర్గాల సాయంతో సామ్రాజ్యవాదులు పాల్పడే మోసాలను ముఖ్యంగా ఆ దేశాల్లోనూ, ప్రతిచోట కూడా శ్రామిక ప్రజల మధ్యన నిత్యం బయల్పరచడం అత్యంత అవసరమైన విషయం". ("Thesis on National Colonies Question" adopted by the Second Congress of Communist International, reproduced in Document of the History of Communist Party of India, P.204)

అందువల్ల ప్రెసిడెంట్ నిక్సన్ ఈ కింది విధంగా ప్రకటించడంలో ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు : "విదేశాల కందించే సహాయం ఒక దేశముగా మనకు అత్యంత స్పష్టంగా మన ప్రయోజనాలకనుగుణమైనదే" అంటూ విదేశీ సహాయ కార్యక్రమాన్ని పెద్దయెత్తున సరిచేయాలనీ, విదేశాలకందించే ఆర్థిక, సైనిక సహాయాన్ని పెంచాలనీ అమెరికా కాంగ్రెస్‌ను కోరాడు. (తాకట్టులో భారతదేశం)

ఇండియాలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ఈ ఆర్థిక దురాక్రమణ యొక్క నిజరూపము, పరిమాణము, వాటి వెనుక వున్న మూల స్తంభం ఎవరు అన్నవి వివరంగా పరిశీలిద్దాం.

**అమెరికా – అతిపెద్ద అంతర్జాతీయ దోపిడీదారు**

అమెరికా అతిపెద్ద అంతర్జాతీయ దోపిడీదారే గాక నేడు నయా వలసవాదానికి మూలాధారంగా వుంది. ప్రపంచ ప్రగతి నిరోధకతకు రక్షణ కోటగా వుంది. అమెరికా ప్రపంచవ్యాప్తంగా వెదజల్లుతున్న విదేశీ సహాయం లక్ష్యం ఏమిటో మనం అర్థం చేసుకోవడం అతి ముఖ్యమైన విషయం.

"ప్రపంచాన్ని అమెరికా ప్రతిరూపంగా మార్చడం మన ధ్యేయం" అని చాలా కాలం క్రితమే అమెరికా మాజీ అధ్యక్షుడు థియొడార్ రూజ్వెల్ట్ ప్రకటించాడు. ఆ లక్ష్య సాధనలోనే ప్రపంచ వ్యాప్తంగా రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు నుండే అదృశ్య డాలర్ సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా తన విషపు హస్తాల్ని చాపుతూ వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఫాసిస్టు దేశాలు పతనమై బ్రిటన్, ఫ్రాన్స్‌లు బలహీనపడడంతో అమెరికా అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరించింది. విదేశాలకు సహాయం అమెరికా నయా వలసవాదానికి ప్రధాన మీట (Lever)గా వుంటున్నది. వెనుకబడిన దేశాల అభివృద్ధికి అమెరికా సహాయం దోహదపడుతుందన్న ప్రచారం ఒకటుంది. అయితే విదేశాలకు సహాయాన్ని పర్యవేక్షించిన మాజీ ఉన్నతాధికారి డి.ఎ.ఫిట్జెరాల్డ్ "అది ఏమాత్రం మా లక్ష్యం కాదు" అని తెగేసి చెప్పాడు. అమెరికా విదేశీ వ్యవహారాల కమిటీ ఒక నివేదికలో ఇలా అంగీకరించారు: "ఆర్థిక సహాయానికి ముఖ్య కారణం ఏమంటే దేశాలు అభివృద్ధి చెందడానికి తాపత్రయ పడుతున్నాయి. ఆ క్రమంలో పాల్గొనడం ద్వారా మాత్రమే మన ప్రయోజనాలకు చక్కగా ఉపయోగపడే విధంగా వాటి అభివృద్ధికి దిశానిర్దేశం చేసే అవకాశం మనకుంటుంది".

నిర్దుష్టంగా చెప్పాలంటే Colombia Journal of World Business అను మ్యాగజైన్‌లో The Domestic Dividents of Foreign Aid అను రచనలో 1965లో E.R.Black ఇలా రాసాడు : "విదేశాలకు సహాయం అను మన కార్యక్రమాలు అమెరికా వ్యాపార రంగానికి ప్రత్యేకమైన లాభాలు చేకూర్చే విధంగా వుంటాయి. ఇవీ మూడు ముఖ్యమైన లాభాలు : 1. విదేశాలకందించే సహాయం అమెరికా సరుకులకు, సేవలకు చెప్పుకోదగిన తక్షణ మార్కెట్‌ను కల్పిస్తాయి. 2. అమెరికా కంపెనీలకు కొత్త విదేశీ మార్కెట్ల కల్పనను ప్రేరేపిస్తుంది. 3. ఆ దేశాల్లోని జాతీయ ఆర్థిక వ్యవస్థలను స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థ వైపుగా మళ్ళించి తద్వారా అమెరికా కంపెనీలు లాభపడవచ్చు".

వెనుకబడిన దేశాలు అమెరికా ఆర్థిక సహాయంపై ఆధారపడుతూ కొనసాగితే అక్కడ స్థానిక పెట్టుబడిదారీ శక్తులు పరిశ్రమలు, వర్తకం, వ్యవసాయ రంగాల్లో ఎదిగే విధంగా అమెరికా ప్రోత్సహిస్తుంది. ఆ దేశాల్లో అమెరికా గుత్త పెట్టుబడిదారీ శక్తులు పాల్గొనేట్లుగా అమెరికా ప్రభుత్వం ప్రోత్సహించి అక్కడ వారి ప్రమేయాన్ని, ఘనమైన లాభాలను ఖాయం చేస్తుంది.

1950–1968 మధ్య విదేశాల్లో అమెరికా పెట్టుబడులు భారీగా పెరిగాయి :

| | |
|---|---|
| **లాటిన్ అమెరికా (డాలర్లలో)** | **4576 - 12989 మిలియన్ డాలర్లు** |
| **ఆసియా** | **998 - 3645 మిలియన్ డాలర్లు** |
| **ఆఫ్రికా** | **147 - 1961 మిలియన్ డాలర్లు** |

కొన్ని లెక్కల ప్రకారం 1951లో అమెరికాలో ప్రయివేట్ పెట్టుబడులపై లాభాల రేటు 14.3% వుండగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 23.1%గా వుండింది. 1963లో 9.9% - 15.7% 1968లో 8.3 % - 30%గా వుండినాయి. అందుకే సెనేటర్ చర్చ్ ఇలా వ్యాఖ్యానించాడు : "విదేశాలకు సహాయ కార్యక్రమం విస్తరించే ఆర్థిక వృక్షంలా ఎందుకు తయారయిందో బడా అమెరికా వ్యాపారం దాని కింద అక్కడ పెట్టే మదుపులపై ఎలా సేద తీరవచ్చునో ఎవరికైనా అర్థమవుతుంది". సహాయ కార్యక్రమం అమెరికా పారిశ్రామిక సరుకులకు ఏటా 1000 మిలియన్ డాలర్ల మార్కెట్‌ను కల్పిస్తుంది. అమెరికా ఓడ రవాణా కంపెనీలకు విదేశాలకు సరుకులను చేరవేయడం ద్వారా దాని మొత్తం రాబడిలో పాతిక భాగం చేకూరుతుంది. ఇండియా డాలర్ సహాయం పొందడం మూలంగా అధిక ధరలు పలికే అమెరికా సరుకులను మాత్రమే కొనవలసి వస్తుంది. ఆ సరుకులను అమెరికా ఓడల ద్వారా మాత్రమే చేరవేసుకోవాలి. అమెరికా రవాణా ఓడలు ఇండియాకు ఎలా వాతలు పెడతాయో 1967 మే నెల 25న ఎకనామిక్ టైమ్స్ పత్రికలో వచ్చిన ఈ దిగువ వార్తను బట్టి తెలుస్తుంది:

"అమెరికా ఆర్థిక సహాయంతో కొన్న అమెరికా ఎరువుల్లో యాభై శాతం అమెరికా ఓడలతోనే రవాణా చేసుకోవాలనే షరతు ప్రకారం రవాణా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి"

అమెరికా ఆర్థిక సహాయం అన్నది ఎంత ఖర్చుతో కూడినదో మనమిప్పుడు అర్థం చేసుకోవచ్చు. అమెరికా ఆర్థిక సహాయం కింద అమెరికా సరుకులకు అధిక ధరలు చెల్లించడమే గాక, అధిక రవాణా ఛార్జీలను, ఇతర అనుబంధ ఖర్చులను భరిస్తూ, రుణంపై వడ్డీలను చెల్లించాలి. కా౹౹ లెనిన్ చెప్పినట్లుగా ద్రవ్య పెట్టుబడిదారుల చేతిలో రుణ సహాయమన్నది రక్తాన్ని పీల్చే రెండంచుల కత్తి.

## ప్రపంచ బ్యాంకు – అమెరికా సహాయం ముసుగు

ప్రపంచవ్యాప్తంగా అమెరికా పేరు ప్రతిష్టలు అపఖ్యాతిపాలు కావడంతో తన వికృత ముఖానికి ముసుగు కప్పే ప్రయత్నంలో ఆర్థిక మీటలను ప్రత్యక్షంగా ఉపయోగించడంతో పాటు అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను మూడవ ప్రపంచ దేశాల్లోకి శోధించి చొరబడడానికి మరింత ఎక్కువగా పాల్పడసాగింది. ఇతర దేశాలు కూడా సభ్యులుగా వున్న ప్రపంచ బ్యాంకు, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు అమెరికా యొక్క అర్థ–అధికార సంస్థలే. ఈ సంస్థల్లో తన ఆర్థిక పలుకుబడి మూలంగా అమెరికా ఆధిపత్య పాత్రను కలిగి వుంటుంది.

రుణాలు, సహాయాలు పొందడంలో ప్రపంచ బ్యాంకు షరతులను పరిశీలిద్దాం. తీసుకుంటున్న రుణం ఒక ప్రత్యేక ప్రాజెక్టు కోసం అయినప్పటికీ ఆ రుణాన్ని మంజూరు చేసే ముందు గ్రహీత దేశపు సాధారణ ఆర్థిక పరిస్థితిని పరిశోధించడానికి, అదే సమయంలో ఆర్థిక గూడుపుఠాణి సాగించడానికి ప్రత్యేక కమిటీని ప్రపంచ బ్యాంకు పంపిస్తుంది. రుణం ఇచ్చిన తరవాత రుణ గ్రహీత దేశం యొక్క ఆర్థిక రాజకీయ పరిణామాలపై క్రమానుగతంగా పరిశోధనా కమిటీలను పంపుతూ నిఘాలో వుంచుకుంటుంది.

"ఉదాహరణకు 1957 నుండి ఏటా మన దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై బ్యాంకు నివేదికలు తయారుచేస్తూ వచ్చింది. ఏటా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థిక శాఖతో నిత్య సమావేశాలు జరుపుతుంది. వివిధ ఆర్థిక సమస్యలపై సలహాలివ్వడానికి, వివిధ ఆర్థిక సమస్యలను సమన్వయపరచడానికి, వివిధ పాశ్చాత్య దేశాల నుండి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి వచ్చే రుణ సహాయాలను సమన్వయపరచడానికి మన దేశంలో శాశ్వత కమీషన్ ఏర్పాటు వుంటుంది. ఆ విధంగా రుణగ్రహీత దేశాల అంతర్గత వ్యవహారాల్లో ప్రపంచ బ్యాంకు జోక్యం చేసుకుంటుంది." (తాకట్టులో భారతదేశం)

ప్రస్తుత యుగంలో ద్రవ్య పెట్టుబడి ఎగుమతి ప్రపంచ వ్యాప్తంగా పెద్ద భాగాన్ని కలిగి వుండి పకడ్బందీగా సమర్థ వంతంగా నిర్వహింపబడుతున్నది. అదే విధంగా ఇండియాలో కూడా విదేశీ రుణం ఏ స్థాయికి చేరిందంటే ద్రవ్య సమతుల్యతను కాపాడడానికి ఏడాదికేడాదికి క్రమంగా మరిన్ని రుణాలు అవసరమవుతాయి. మన ఆర్థిక వ్యవస్థ నానాటికీ అధ్వాన్నమవుతూ అంతులేని ద్రవ్య సంక్షోభం ఇప్పటికే మొదలైంది. దీన్ని గురించిన వివరాలు తరవాత పరిశీలిద్దాం. ఇప్పటికి తేలిందేమిటంటే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య పెట్టుబడి దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్నది. అభివృద్ధి చెందని వెనుకబడిన దేశాలు పూర్తిగా దాని గుప్పిట్లోకి చేరిపోయాయి.

**2వ లక్షణం విశ్లేషణ :** అర్థవలస దేశాల్లో సామ్రాజ్యవాదం ప్రత్యక్ష పాలనకు బదులు శిక్షణ పొందిన విశ్వాసపాత్రులైన దళారీల చేతికి పాలన పగ్గాలనిస్తుందని ఇది వరకే ప్రస్తావించాం.

ప్రధానాంశాన్ని చర్చించే ముందు మన స్వాతంత్ర్య పోరాట వాస్తవ చరిత్రను తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే ఆ చరిత్రలో బడా భూస్వామ్య, బడా బూర్జువాల రాజకీయ పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పాల్పడిన విద్రోహ ఉదంతాలు దాగి వున్నాయి. మన దేశ స్వాతంత్ర్యం అనబడే దాని వెనుక వున్న వాస్తవాలు అత్యధిక ప్రజలుకు నేటికీ తెలియదు. అందుకే చరిత్రకు సంబంధించిన ఆ ప్రత్యేక అధ్యాయాలను మనం తెరచి చూడాలి.

స్వాతంత్ర్య పోరాటంలో సామాన్య ప్రజానీకం పెద్దయెత్తున క్రియాశీలంగా పాల్గొన్నారని మనకు తెలుసు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఎన్నో విప్లవాత్మక ప్రజాతంత్ర పోరాటాలు జరిగాయి. సిపాయి తిరుగుబాటు, నౌకాదళం తిరుగుబాటు, దేశవ్యాప్తంగా కార్మిక కర్షక జనావళి అసంఖ్యాక ఆర్థిక రాజకీయ పోరాటాలు, సామాన్య ప్రజల వివిధ ప్రజాతంత్ర ఉద్యమాలు మొ॥ బడా బూర్జువా, బడా భూస్వాముల రాజకీయ వేదిక అయిన జాతీయ కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రోద్యమంలో నాయకత్వ స్థానంలో వుంటూ అన్ని ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేస్తూ సామాన్య ప్రజల విప్లవ ఆకాంక్షలను పక్కకు నెట్టి 1947లో బ్రిటిష్ ప్రభుత్వంతో లాలూచీ పడి శాంతి ఒప్పందం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఈ అధికార మార్పిడిలో ఎటువంటి రహస్య ఒప్పందాలు చేసుకున్నారో, ఎటువంటి అంశాలు, షరతులు కుదుర్చుకున్నారో అత్యధిక ప్రజలకు ఏమీ తెలియదు. మనకు తెలిసిందల్లా ఏమిటి అంటే ఈ ఒప్పందం వల్ల ఒక వైపు బడా బూర్జువా వర్గం, బడా భూస్వాములు మరియు సామ్రాజ్యవాదులు ఏటేటా వారి సంపదలను పెంచుకుంటూ పోయారు. దీని ఫలితంగా మరో వైపు శ్రామిక జనావళి అణచివేతకూ, దోపిడీకి గురై నలిగిపోయి క్రమంగా దారిద్ర్యరేఖ దిగువకు పడిపోయారు.

కనుక, స్వాతంత్ర్యానికి ముందు మరియు తరువాతి కాలంలో బడా బూర్జువా వర్గ పాత్రను గురించి వివరమైన సమీక్ష లేకుండా మన దేశం సరైన దిశలో ఎందుకు ముందుకు పోవడం లేదో, దేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ ఎందుకు అధ్వాన్నంగా తయారవుతున్నదో మనకు అర్థం కాదు.

కా॥ తరిమెల నాగిరెడ్డి తన పుస్తకం 'తాకట్టులో భారతదేశం'లో ఈ విషయంపై కా॥ లెనిన్ బోధనలు ఆధారంగా బడా బూర్జువావర్గం మౌలిక లక్షణాలను వివరంగా విశ్లేషించాడు. దాని గురించి తెలుసుకుందాం.

**బూర్జువావర్గం – బూర్జువా ప్రజాతంత్ర విప్లవం**

అటువంటి విద్రోహం మార్క్సిస్టులు అయిన వారికెవరికీ విస్మయం కలిగించదు. సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగంలో బూర్జువావర్గం ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేయజాలదని 1905 నాడే కా॥ లెనిన్ ఎత్తి చూపాడు. "Two Tasks of Social Democracy"లో ఇలా పేర్కొన్నాడు : "ఖచ్చితంగా చెప్పాలంటే గతానికి చెందిన అర్ధ బానిసత్వ వ్యవస్థ (Serfdom) లక్షణాల అవశేషాలున్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా ఊడ్చివేసే భూకంపం వంటిదే బూర్జువా విప్లవం".

అయితే "బూర్జువా వర్గం తనకు తానే వంచించు కుంటుంది" అనీ, అది "నిలకడయిన ప్రజాతంత్ర విప్లవ స్వభావం కలిగి వుండడం బూర్జువాజీకి చేత కాదు" అనే కా॥లెనిన్ స్పష్టపరిచాడు.

"బూర్జువా ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపనకు అవసరమైన మార్పులు నెమ్మదిగా క్రమాను సారంగా, గెంతులు లేకుండా సంస్కరణల ద్వారా, విప్లవం ద్వారా కాకుండా జరగడం బూర్జువాజీకి చాలా అనుకూలంగా వుంటుంది". (Two Tactics of Social Democracy)

బూర్జువా వర్గం ఎందుకు బూర్జువా విప్లవం గురించి భయపడుతుంది? గతానికి చెందిన దాన్ని ఊడ్చి పారెయ్యడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తుంది? అర్థబానిస వ్యవస్థను వీలైనంత మేరకు పదిలపరచడానికి ఎందుకు కోరుకుంటున్నది? రైతాంగము, కార్మికులు తుపాకులను ఒక భుజం మీది నుండి మరొక భుజం మీదకు మార్చుకొని అర్థ భూస్వామ్య వ్యవస్థనే గాక దాని నేల మీదనే నిలిచి సాగుతున్న బూర్జువా ఆస్తిని కూడా రద్దు చేయడానికి ఉరకలేస్తారన్న భయమే అందుకు కారణం.

అందువల్లనే బూర్జువా వర్గం "దౌర్భాగ్యపు రాజీ"కి దిగుతుందనీ, "నిర్ణయాత్మక విజయాన్ని సాగించడానికి అది అశక్తురాలనీ; అసలు నిజానికి "నిర్ణయాత్మక విజయాన్ని కోరుకోదనీ", కా॥ లెనిన్ హెచ్చరించాడు. "శ్రామిక వర్గానికి, రైతాంగానికి వ్యతిరేకంగా ఉపయోగించడానికి జారిజం దాని నిరంకుశాధికార వర్గాలు, పోలీసు, సైనిక బలగాలు వారికి ఎంతో అవసరం కనుక అవి నశించిపోవడానికి వారు ఇష్టపడరు".

ఈ కారణం వల్లనే "బూర్జువా వర్గం తన సంకుచిత స్వార్థ ప్రయోజనాలు నెరవేరగానే, నిలకడైన ప్రజాతంత్రం నుండి వెనక్కు మరలగానే అనివార్యంగా విప్లవ ప్రతీఘాతం వైపు, నిరంకుశత్వం వైపు, విప్లవానికి, ప్రజలకు వ్యతిరేకంగా మారిపోతుంది".

"అందువల్లనే బూర్జువా వర్గం ప్రజాతంత్ర విప్లవాన్ని తుదికంటా కొనిపోదు". (లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్)

కా॥ లెనిన్ యొక్క థీసిస్‌ను భారతదేశపు బూర్జువా వర్గము, దాని రాజకీయ హస్తమైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ విలక్షణంగా నిరూపించాయి. ఆ పార్టీ సర్వసేనాని అయిన 'మహాత్ముడు', అతని సహచరులు సామ్రాజ్యవాదం యొక్క అతిగొప్ప అత్యంత నమ్మకస్తులైన మిత్రులుగా తమని తాము నిరూపించుకున్నారు. "గాంధీ అహింసా విధానానికి బ్రిటిష్ పాలకులు రుణపడి వుండడానికి తగినన్ని కారణాలున్నాయని"

తన 'ఏషియన్ డ్రామా' పుస్తకంలో గున్నార్ మిర్డాల్ వ్యాఖ్యానించడంలో ఆశ్చర్యపడలసినది ఏమీ లేదు. ఎందుకంటే స్వాతంత్ర్యానంతరం పూర్వపు సామ్రాజ్యవాద దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగడమే కాక కొన్ని విధాలుగా దృఢతరం అయినాయి". (తాకట్టులో భారతదేశం)

## భారత బూర్జువా వర్గపు నీచమైన విద్రోహం

వలస పాలకుల నుండి భారత బూర్జువా వర్గానికి అధికార మార్పిడి ఎలా జరిగింది? ఈ శాంతియుత మార్పిడికి దారి వేసిన కారకాలేవి? గాంధీ ఆయన సహచరులకు బ్రిటిష్ పాలకులు కృతజ్ఞులై వుండడానికి కారణమైన కారకాలేవి? భారతదేశ ప్రజానీకానికి ఈ విధమైన అధికార మార్పిడి యొక్క ప్రాముఖ్యత ఏమిటి? స్వాతంత్ర్యం అనబడే దాని అసలు సారాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ ప్రశ్నలను వేసుకొని శోధించాలి.

రెండవ ప్రపంచ యుద్ధ సమాప్తి పెట్టుబడిదారీ సంక్షోభాన్ని తగ్గించడం గాక దాని సకల లక్షణాలు యుద్ధం ముగిసే నాటికి తీవ్రతరమైనాయి. కా॥ స్టాలిన్ నాయకత్వంలో ఫాసిజాన్ని బద్దలుకొట్టి ఓటమిపాలు చేయడంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన చరిత్రాత్మక పాత్ర, కా॥ మావో సేటుంగ్ నాయకత్వాన చైనా విప్లవం అప్రతిహతంగా పురోగమిస్తూ విజయం చేరువలో వుండడం – ఇవన్నీ వలస పాలనకు వ్యతిరేకంగా దక్షిణ ఆసియా దేశాలన్నింటిలోనే గాక, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా దేశాలలో సైతం విమోచనోద్యమాలు పెల్లుబుకడానికి నిర్ణయాత్మక ప్రోత్సాహాన్నిచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం పొందిన దేశాల, ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్స్‌ల శక్తి, పరువు ప్రతిష్టలు క్షీణించడం, శ్రామికవర్గ రాజ్యమైన సోవియట్ యూనియన్ ఒక బలీయమైన అంతర్జాతీయ శక్తిగా ముందుకు రావడం, వలస దేశాలన్నింటి లోనూ విమోచనోద్యమాల్లో గర్భితమై వున్న విప్లవ శక్తులను వెలికి లాగి పురోగమించేలా చేశాయి.

అలాంటి చారిత్రక అంతర్జాతీయ పరిస్థితుల్లోనే రెండవ ప్రపంచ యుద్ధానంతర భారతదేశంలో కోట్లాది మంది ప్రజలు వెల్లువ లాగా పోరాటాల్లోకి కదలడం చూశాం. ఆజాద్ హింద్ ఫౌజ్ (INA) సైనికులపై విచారణకు వ్యతిరేకంగా సాగిన మిలిటెంట్ నిరసన ప్రదర్శనలు, అన్ని వర్గాలను, కులాలను, జాతులను మిలిటెంట్ పోరాటాల్లోకి సమైక్యం చేసిన రాయల్ ఇండియన్ నౌకాదళ శ్రేణుల మహత్తర తిరుగుబాటు, సైన్యంలోనూ, విమాన బలగంలోనూ కన్పించిన బహిరంగ తిరుగుబాటు సూచనలు – ఇవన్నీ భారతదేశంలో విమోచనోద్యమం పరిపక్వమవుతోందని వెల్లడి చేశాయి. దేశవ్యాపితంగా శ్రామికవర్గం తన కాళ్ళపై లేచి నిలబడింది. ఉధృతమైన రాజకీయ సమ్మెలు నిత్యకృత్యమైనాయి. రాచరిక పాలనలో వున్న రాష్ట్రాల్లో జన సమూహాలు ప్రధానంగా రైతాంగం భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా కదం తొక్కారు. ఆ విధంగా భారతదేశంలో ఉద్యమం మొట్టమొదటిసారిగా పౌర జనంలోనే గాక, సాయుధ బలగాల మధ్య కూడా వెల్లువలా పురోగమించింది.

దీనితో బ్రిటిష్ పాలకులు వణికిపోయారు. భారత బూర్జువా వర్గ నాయకత్వం భయవిహ్వలమైంది. ఈ రెండు శక్తులూ ఏకమై శతాధిక సంవత్సరాల పాటు దేశాన్ని పాలించిన సామ్రాజ్యవాదాన్ని, తరతరాల ఫ్యూడల్ అర్థ బానిసత్వాన్ని సమూలంగా తుడిచివేసే బ్రహ్మాండమైన శక్తిగా అభివృద్ధి చెందుతున్న ప్రజాబాహుళ్యాన్ని, సాయుధ బలగాల ఐక్యతను విచ్ఛిన్నం చేసి నాశనం చేయడానికి పూనుకొన్నాయి. ఇది భారతదేశంలో నూతన శకానికి ఒక సంకేతమైంది. బ్రిటిష్ పాలన యొక్క పునాదులు, దాని అధికార యంత్రాంగం ఛిన్నాభిన్నం కావడం స్పష్టంగా వెల్లడయింది. ఊహించని ప్రజాగ్రహం పర్యవసానాల పట్ల భయగ్రస్తమై భారత బూర్జువా వర్గం విద్రోహ చర్యకు త్వరపడింది.

1946 ఫిబ్రవరి 21న తిరుగుబాటు చేస్తున్న నావికా దళంపై కాల్పులు జరపడానికి భారత సైనికులు తిరస్కరించి నప్పుడు బ్రిటిష్ సైన్యాలను రంగంలోకి దించారు. ఆ సమయంలో అడ్మిరల్ గాడ్ఫ్రే "నౌకాదళం సర్వనాశనం అయినా సరే ప్రభుత్వాధీనంలో వున్న అసంఖ్యాక బలగాన్ని పెద్దఎత్తున వినియోగించగలం" అని హెచ్చరిక చేశాడు. కాంగ్రెస్ పార్టీ ఉక్కు మనిషిగా పేరు గాంచిన వల్లభాయ్ పటేల్ నావికా తిరుగుబాట్లను ఖండించి "నావికా దళంలో క్రమశిక్షణ వుండవలసిందే" అనిన ప్రధాన సైనికాధికారి వ్యాఖ్యల్ని సమర్థించాడు. విమోచన పోరాటానికి అంతిమ విద్రోహం చేసిన ఈ చివరి దశలో కాంగ్రెస్ అధ్యక్షునిగా వున్న మౌలానా ఆజాద్ "ప్రస్తుత అధికారానికి వ్యతిరేకంగా సమ్మెలు, హర్తాళ్ళు, ధిక్కరణలకు స్థానం లేదని ప్రకటించాడు. ఈ మహత్తర తిరుగుబాటులో ప్రదర్శితమైన హిందూ ముస్లింల ఐక్యతను, దాని పట్ల ప్రజల్లో పెల్లుబికిన విస్తృతమైన అండదండలను "అపవిత్ర కూటమి"గా ఖండించడం ద్వారా దానిపై మహాత్మా గాంధీ చివరి దెబ్బతీశాడు. ఆయన ఇలా అన్నాడు : "ఈ తిరుగుబాటు భారతదేశాన్ని అల్లరిమూకల చేతుల్లోకి నెట్టి వుండేది. ఇలా జరగడాన్ని స్వయంగా చూడడానికి 125 సం॥ల పాటు జీవించడం కంటే మంటల్లో పడి నాశనం కావడానికే నేను ఇష్టపడతాను". దినదినం పెరుగుతున్న వివిధ తరగతుల ప్రజల విప్లవ కార్యాచరణ పట్ల ఉన్నత వర్గాలలో గల భయాన్ని ఎంతో తేటతెల్లంగా బయటపెడుతున్న మాటలివి.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బూర్జువా వర్గం నిర్ణయాత్మక విజయాన్ని కాంక్షించడం లేదని దీనితో స్పష్టమౌతుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాతంత్ర విప్లవాన్ని తుదికంటా కొనసాగించడం బూర్జువావర్గానికి చేత కాదని కూడా స్పష్టమైపోయింది. వారి దృష్టిలో "అల్లరి మూకలు" అయిన

శ్రామికవర్గాన్ని, రైతాంగాన్ని అణచివేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదం తన వంద సంవత్సరాలకు పైగా జరిపిన పాలనలో పెంచి పోషించిన నిరంకుశ పాలనా యంత్రాంగం, దాని మిలటరీ పోలీసు బలగాలు ఇప్పుడు భారత బూర్జువా వర్గానికి చాలా అవసరమయ్యాయి. అందుకనే ఈ యంత్రాంగం ధ్వంసం కావడం వారికి ఏ మాత్రం ఇష్టం లేదు.

ఆ విధంగా సామ్రాజ్యవాదంతో నీచమైన రాజీ బేరం మొదలయింది. అంతిమంగా ద్రోహం చేయడానికే వారు సిద్ధమయ్యారు.

అదే విధంగా విప్లవ శక్తుల్ని చూసి భారత బూర్జువా వర్గం ఎంతగా భయపడిందో, అంతగా సామ్రాజ్యవాదం కూడా తన అంతిమ నాశనం పట్ల భయవిహ్వలమైంది. బలప్రయోగంతో భారతదేశ పరిస్థితిని అదుపులో పెట్టడం సాధ్యం కాదని సామ్రాజ్యవాదం అర్థం చేసుకొంది. ఆ సమయంలో తిరుగుబాటు జ్వాలలతో అట్టుడికి పోతున్న దేశంలో బ్రిటిష్ అధికారాన్ని నిలబెట్టడానికి గణనీయమైన అదనపు సైనిక బలగాలను దించే స్థితిలో యుద్ధంలో విసిగి వేసారి ఆర్థికంగా ఛిన్నాభిన్నమైన బ్రిటన్ లేదని భారతదేశ తూర్పు విభాగం కమాండ్ ప్రధాన సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ సర్ ఫ్రాన్సిస్ టకర్ అభిప్రాయపడినాడు. ఆయన తన పుస్తకం While Memory Serves (P. 518)లో ఇలా రాసాడు : "ఆర్థికంగా క్షీణించిన మా దేశపు పారిశ్రామిక అవసరాల కన్నా ఈ సైన్యం పెంపుదల అవసరం మించి పోయేదిగా భరించలేనిదిగా వుందని మేము అనుకొన్నాం. మేం భారతదేశాన్ని వదిలేసి రావడానికి, అందునా అంత తొందరగా వదిలేసి రావడానికి అది మరొక గట్టి కారణం".

భారతదేశాన్ని అధీనంలో వుంచుకోవడానికి "దేశీయాంగ శాఖను విపరీతంగా విస్తృత పరచడం, బ్రిటిష్ సైన్యాలు విపరీతంగా అవసరమై వుండేవని" అధికార మార్పిడి కొరకు రాజీ బేరాలు సాగించిన వారిలో ముఖ్యుడైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్ బ్రిటిష్ పార్లమెంటులో వెల్లడించాడు. ఈ ప్రత్యామ్నాయాన్ని త్రోసి పుచ్చుడానికి తనకు ఏ మాత్రం తటపటాయింపు లేకపోయింది" అని కూడా ఆయన వెలిబుచ్చారు.

అందువల్లనే భారతదేశంలో తన ఆర్థిక, పారిశ్రామిక, వ్యాపార స్థానాలన్నిటినీ భద్రంగా కాపాడుకోవాలనుకుంటే రాజీపడడం, ఈ ప్రాంతంలో తన రాజకీయాధిపత్యాన్ని వదులుకొనడం అవసరమని బ్రిటిష్ ప్రభుత్వం భావించింది.

ఆ విధంగా భారతదేశాన్ని "అల్లరి మూకల" చేతుల్లో పడకుండా 'రక్షించడానికి' రాజీ అవసరమని భారత బూర్జువా వర్గం, బ్రిటిష్ వలస ప్రభుత్వం రెండూ కూడా ఆతృతను ప్రదర్శించాయి.

**రాజీ – అధికార మార్పిడి**

ఆ విధంగా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే అంతర్జాతీయ రంగంలో బలాబలాల్లో వచ్చిన మార్పులు, భారతదేశంలో ఊహించని విధంగా సాగుతున్న అన్ని తరగతుల ప్రజల విప్లవ వెల్లువ భారత బూర్జువా వర్గంతో రాజీ బేరాలు కుదుర్చుకోవడానికి అప్పటికే బలహీనపడ్డ బ్రిటిష్ పాలకుల్ని తొందరపెట్టాయి. 1945 వేసవిలో రాజీ బేరాలు కుదుర్చుకోవడానికి గల అవకాశాలను పరిశీలించడానికి భారత పరిశ్రమల అగ్రాధిపతులైన జెడి బిర్లా, జెఆర్‌డి టాటాల నాయకత్వాన ఒక అధికార పారిశ్రామిక ప్రతినిధి వర్గం ఇంగ్లాండు, అమెరికాలు పర్యటించింది. కాంగ్రెస్ నాయకులు జైళ్ళ నుండి విడుదల చేయబడి, సంఘటనలు అతివేగంగా జరిగిపోతున్న దిశ అది. "భారత పారిశ్రామిక అభివృద్ధి పట్ల బ్రిటిష్ పరిశ్రమల వైఖరిలో ఖచ్చితమైన మార్పు వచ్చిందని, బ్రిటన్‌లోని బడా పారిశ్రామికాధిపతులు భారతదేశంలో పారిశ్రామికీకరణ అనివార్యతను అంగీకరించడమే గాక చాలా సందర్భాల్లో భారత రాజకీయ వాంఛలకు అనుగుణంగా వుండడానికి అంగీకరిస్తున్నారని కనుగొనడం ద్వారా భారత – బ్రిటిష్ సహకారంలో నూతన అధ్యాయాన్ని ఆ పారిశ్రామిక ప్రతినిధి వర్గం ప్రారంభించిందని Eastern Economist పత్రిక 1945 జూన్ 27న రాసింది.

రాజీ పడడానికి సంసిద్ధత, ఘటనల వేగాన్ని పెంచింది. అధికార మార్పిడి చేయాలని బ్రిటిష్ మంత్రివర్గం నిర్ణయించుకుంది. మంత్రివర్గ ప్రతినిధివర్గం ఒకటి ఢిల్లీ చేరుకుంది. ఆ వెంటనే కేంద్రంలో నెహ్రూ నాయకత్వాన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పరచబడింది. 1947 ఆగస్టు 15 నాటికి అధికార మార్పిడి ప్రకటించబడింది. "స్వతంత్ర" భారతదేశానికి లార్డ్ మౌంట్ బాటన్ ప్రప్రథమ గవర్నర్ జనరల్‌గా, జవహర్‌లాల్ ప్రప్రథమ ప్రధానమంత్రిగా 1935 నాటి భారత రాజ్యాంగం ప్రకారం భారత స్వాతంత్ర్యం ప్రకటించబడింది.

అది స్వాతంత్ర్యం ప్రకటించబడిన విధానం. బ్రిటిష్ పతాకం అవనతం చేయబడింది. దాని స్థానంలో త్రివర్ణ పతాకం ఎగురవేయబడింది. కారల్ మార్క్స్ తన "లూయిబోన పార్టీ 18వ బ్రోమేయర్" అనే రచనలో వర్ణించినట్లుగా "చిట్టచివరికి వధువును ఇంటికి తీసుకొని వచ్చారు. కానీ ఆమె అప్పటికే వ్యభిచారిణిగా మారిపోయింది''. జాతీయ నాయకులు "రాజ్యాంగ కుతంత్రాల ద్వారా చరిత్రగతిని మోసగించ జూశారు".

ఈ విధంగా స్వాతంత్ర్య యుద్ధమనేది లేకుండానే, జాతీయ విమోచన సైన్యం అవసరం లేకుండానే, భారత స్వాతంత్ర్యం శాంతియుతంగా రాజ్యాంగబద్ధంగా సాధించబడింది. ఫలితంగా 1947 ఆగస్టు 15న బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో తాను నెలకొల్పిన అన్ని వ్యవస్థలను, సర్వీసులను దత్తం చేస్తూ, నూతన భారత ప్రభుత్వానికి సుహృద్భావ వాతావరణంలో, క్రమబద్ధంగా అధికారాన్ని మార్పిడి చేసింది. (తాకట్టులో భారతదేశం)

### నూతన ప్రభుత్వం – దేశ నిర్మాణం

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి కాక పూర్వం ఎంతో కాలం క్రిందటే తన దేశ ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నాడు:

ఇండియన్ సివిల్ సర్వీసెస్ (ICS) ప్రభావం మన పరిపాలనా ప్రజాసేవా రంగాలలో ఉన్నంత కాలం నూతన వ్యవస్థను నిర్మించడం సాధ్యం కాదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. కావున నాకు అతి ముఖ్యమైనదని అనిపించేదేమిటి అంటే మనం కొత్త క్రమాన్ని నిర్మించడాన్ని ఆరంభించే ముందుగా ఐసిఎస్, తత్సమాన సేవలు పూర్తిగా అంతర్థానం కావాలి. వారికి నేడు ఇవ్వబడుతున్న అసంబద్ధమైన జీతాలు, అలవెన్సులు భవిష్యత్తులో చెల్లించబడతాయనేది అసలు అనూహ్యమైన విషయం". (An Autography - Nehru)

"వైస్రాయిల జీతాలు ఎలాంటి అతిపెద్ద అనూహ్యా స్థాయి వేతనాలు చెల్లిస్తున్నారో వ్యవస్థ అంతటా దాదాపు అటువంటి వేతనాల చెల్లింపే పాలనా యంత్రాంగం అంతటా జరుగుతున్నది. ఈ అధిక వేతనాల చెల్లింపుల పద్ధతిని మొత్తంగా రద్దు చేయాలి" అని మహాత్మా గాంధీ 1930లో వైస్రాయి లార్డ్ ఇర్విన్‌కి రాసిన ఉత్తరంలో సూచించాడు (కాంగ్రెస్ చరిత్ర – పట్టాభి సీతారామయ్య)

ఈ వ్యవస్థ నెహ్రూ ఆశించినట్లుగా పూర్తిగా అంతర్థానమై పోయిందా? లేదా అహింసామూర్తి గాంధీ విజ్ఞప్తి చేసినట్లుగా పూర్తిగా రద్దు చేయబడిందా? లేదు. బూర్జువావర్గ నాయకత్వం జాతీయ విప్లవానికి చేసిన విద్రోహం వల్ల అప్పట్లో వున్న పరిపాలనా వ్యవస్థను కాపాడింది. అంతేగాక, ఉన్నత అధమ స్థాయిల్లో వేతనాల తేడా కూడా కాపాడబడింది. May and S పార్లమెంటరీ పద్ధతుల నుంచి క్రింది స్థాయి పాలనోద్యోగుల గురించి రహస్య ఫైళ్ళు నిర్వహించడం దాకా శాంతి భద్రతలను కాపాడడానికి వలస పాలనలో రూపొందించి ప్రవేశపెట్టిన పాలనాపరమైన అలవాట్లు, విధానాలు కూడా ఈనాటికీ రాజ్యం చేస్తున్నాయి. (పై పుస్తకం)

నాటి దేశస్థుల ఐక్య పోరాటాలపై ఇంతటి విద్రోహం మునుపెన్నడూ జరగలేదు.

### రాజ్యాంగ సభ – భారత రాజ్యాంగం

భారత రాజ్యాంగ సభ చరిత్ర అంతా దేశ ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ఆకాంక్షలకు ఘోరంగా విద్రోహం చేసిన చరిత్ర మాత్రమే. రాజ్యాంగ సభను ఏర్పరిచిన తీరే అసంబద్ధమైనదీ, అనుచితమైనదీ.

దేశ జనాభాలో 90 శాతంగా వున్న రైతాంగాన్నీ, కార్మిక వర్గాన్నీ ఓటింగ్ నుండి మినహాయించి 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ప్రకారం రాజ్యాంగ సభ సభ్యులు ఎన్నుకోబడ్డారు. పరిమితమైన ఓటర్లు కూడా రాజ్యాంగ సభకు సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకోలేదు. రాష్ట్ర శాసనసభలలో ఎన్నుకోబడిన సభ్యులు కొందరు ఓటర్లుగా ఏర్పడి ఆయా రాష్ట్రాల నుండి కొద్ది మంది సభ్యులను రాజ్యాంగ సభకు ఎన్నుకున్నారు. కొందరు నామినేటెడ్ సభ్యులు కూడా ఇందులో వున్నారు. స్వేచ్ఛాయుత ప్రజలచే ఎన్నుకొనబడినది అని చెప్పదగ్గ ఒక్క లక్షణము కూడా ఆ రాజ్యాంగ సభకు లేదు.

1852 జర్మన్ పార్లమెంట్ 'డైట్' గురించి మార్క్స్ వర్ణించినట్లుగా ఇది పాత వలస రాజ్యాంగంతో అక్రమ సంబంధం వల్ల జనించిన 'అక్రమ శిశువు' మాత్రమే. యవ్వనం వచ్చే నాటికే 'తన కన్యాత్వాన్ని కోల్పోయి' వెంట్రుకలు తెల్లబడిపోయి, కుహనా దౌత్య వ్యభిచారంలో అన్ని యుక్తుల్లో బాగా ఆరితేరిపోయినట్లుగా వుంది. ఈ రాజ్యాంగ సభలో లిబరల్ న్యాయవాదులు బ్రిటిష్ విద్యావిధానంలోనూ, సంస్కృతి లోనూ తర్ఫీదు పొందిన సిద్ధాంతవేత్తలైన ప్రొఫెసర్లు మాత్రమే సభ్యులు. పైకి చూడటానికి దేశభక్తియుత భారత మేధావులంతా దీన్లో సభ్యులుగా ఉన్నట్లు అనిపిస్తుంది. నిజానికి అది ముసలి క్షుద్ర రాజకీయవేత్తలు తమ నిర్జీవ ఆలోచనలను, కార్య నిర్వీర్యతను డాబుగా ప్రదర్శించుకొనే ఒక రంగస్థలం వంటిది మాత్రమే. రెండేళ్ళపాటు సాగిన కనీస సిద్ధాంత విలువ కూడా లేని చర్చలు, తర్కవితర్కాల తరవాత ఈ గొప్ప అసమర్థ రాజ్యాంగ సభ 1935 రాజ్యాంగాన్ని అన్ని విధాలా పోలిన ప్రపంచంలో కెల్లా అతిదీర్ఘ రాజ్యాంగాన్ని రూపొందించింది.

స్వతంత్ర భారతదేశ రాజ్యాంగంగా చెప్పబడిన ఈ రాజ్యాంగం 1935 రాజ్యాంగాన్ని కొట్టొచ్చేట్లు పోలి వుండడంలో వింత ఏమైనా వుందా? దేశ ఆర్థిక సామాజిక పరిస్థితుల్లో యథాతథస్థితిని నిలబెట్టాలని పాలకవర్గం నిర్ణయించుకొని, ఆర్థిక వ్యవస్థలో ఎట్టి ఆకస్మిక మార్పులు లేకుండా, ప్రస్తుతం వున్న నిర్మాణానికి ఏ మాత్రం దెబ్బ తగలకుండా చూడాలని నిర్ణయించుకున్నప్పుడు, అంతకు ముందున్న పాత రాజ్యాంగాన్ని పోలిన రాజ్యాంగాన్ని కాక దానికి మౌలికంగా భిన్నమైన రాజ్యాంగం ఎలా ఆవిర్భవిస్తుంది? భారత రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని చెప్పి పాలకవర్గమూ, దాని ఏజెంట్లు భారత ప్రజలను మోసగించారు. అయితే తాము రూపొందించిన రాజ్యాంగం ఎటువంటిదో బూర్జువావర్గానికి స్పష్టంగా తెలుసు.

ఆ విధంగా మన రాజ్యంగం సామ్రాజ్యవాదులచే ఎంతో జాగ్రత్తగా ఎంతో శ్రమపడి వేసిన పునాదులపై నిర్మించబడిన ఉపరితల నిర్మాణం మాత్రమే. అప్పటికే వున్న న్యాయ వ్యవస్థను, పరిపాలనా వ్యవస్థను వాటి చట్టాలు, నియమ నిబంధనలతో సహా చట్టబద్ధం చేయడం, అప్పటికే అమలులో వున్న సామాజిక ఆర్థిక వ్యవస్థను మరింత బలీయం చేయడం, ఈ నూతన రాజ్యాంగం యొక్క అసలు ఉద్దేశం. ఆ విధంగా "జాతీయ నాయకత్వం" పేరిట ప్రాతినిధ్యం వహించిన బూర్జువావర్గం భారత ప్రజలను విద్రోహానికి గురిచేయడాన్ని ఈ రాజ్యాంగం పూర్తి చేసింది. నూతన రాజ్యాంగాన్ని ఆమోదించడంతో అప్పటికున్న నిర్మాణ వ్యవస్థ పదిలతకు ఏ మాత్రం దెబ్బ

తగలకుండా భారత బూర్జువా వర్గం దేశంలో అధికారాన్ని స్వీకరించింది.

రాజ్యాంగ రచనా కమిటీ, అధ్యక్షుడిగా రాజ్యాంగాన్ని రచించడంలో ముఖ్యపాత్ర వహించిన అంబేద్కర్ 1949, నవంబర్ 25న భారత రాజ్యాంగ సభలో నూతన రాజ్యాంగం మూడవ పఠనం సందర్భంగా జరిగిన చర్చ అనంతరం ఇచ్చిన సమాధానంలో పరిస్థితులను గురించి స్పష్టపరుస్తూ ఇలా అన్నాడు : “1950 జనవరి 26న వైరుధ్యాలతో కూడిన జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. మనకు రాజకీయాల్లో సమానత్వం ఆర్థిక జీవితంలో అసమానత్వం వుంటాయి. రాజకీయాల్లో ఒక్క మనిషికి ఒక్క ఓటు, ఒక్క ఓటుకు ఒకే విలువ అనే సూత్రాన్ని మనం గుర్తించబోతున్నాం. మనకున్న సామాజిక ఆర్థిక నిర్మాణంగా మన సామాజిక ఆర్థిక జీవితంలో ఒక మనిషికి ఒకే విలువ అనే సూత్రాన్ని తిరస్కరించడాన్ని కొనసాగిస్తూనే వుంటాం.... సాధ్యమైనంత వేగిరంగా ఈ వైరుధ్యాన్ని మనం తొలగించాలి. లేనట్లయితే అసమానత్వానికి గురయ్యేవారు ఈ సభ ఎంతో శ్రమపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక నిర్మాణాన్ని పేల్చివేస్తారు”.

కావున మన రాజ్యాంగం యొక్క వాస్తవ సారం ఇదీ.

## కొత్త ప్రభుత్వ ఆర్థిక విధానం

1948 ఏప్రియల్ 6న విదేశీ పెట్టుబడిదారుల భయాలను, సందేహాలను తొలగించడానికి భారత ప్రభుత్వం ఆర్థిక విధానంపై తాను ఆమోదించిన తీర్మానాన్ని ప్రకటించింది. ఆయుధ సామాగ్రి, రైల్వేలు, విద్యుచ్ఛక్తి, అణుశక్తి తప్ప “మిగిలిన పారిశ్రామిక రంగమంతటా సాధారణంగా ప్రైవేటు పెట్టుబడికి అవకాశం వుంటుంది.” అని ఆ తీర్మానం పేర్కొంది. అంటే అప్పటికున్న సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడితో సహా గుత్త సంస్థలకు తన అనుకూలతను ప్రభుత్వం వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాద పెట్టుబడి వర్గాలలో ఇంకా ఏ మూలనయినా మిగిలిన భయసందేహాలను పూర్తిగా పోగొట్టడానికి, పై తీర్మానంతో పాటుగా ప్రచురించబడిన వివరణ పత్రంలో ప్రభుత్వం మరింత స్పష్టంగా ఇలా చెప్పింది :

“భారత పారిశ్రామిక రంగంలో విదేశీ పెట్టుబడికి, సంస్థలకు పూర్తి స్వేచ్ఛ వుంటుందని తీర్మానం హామీ ఇస్తున్నది. అయితే అదే సమయంలో జాతీయ ప్రయోజనాల రీత్యా దాన్ని క్రమబద్ధం చేయడం అవసరం అని భావిస్తోంది.” తీర్మానంలోని ఈ భాగం నిర్వహణా విధానంలోనూ, సాంకేతిక శిక్షణలోనూ, పెట్టుబడి మదుపులోనూ విదేశీ సహాయం అవసరాన్ని, భారత పరిశ్రమలకు సహాయకారిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించడంలో వున్న విజ్ఞతను భారత ప్రభుత్వం గుర్తిస్తున్నది.

“విదేశీ పెట్టుబడికి, వ్యాపారానికీ భారత పరిశ్రమల్లో పూర్తి స్వేచ్ఛ” ఇవ్వడమన్నది “భారతదేశ రత్నం”గా కీర్తించబడి, “సోషలిస్టు”గా మన్ననలు పొందిన నెహ్రూ అధినేతగా వున్న భారత ప్రభుత్వపు ప్రకటిత విధానమైంది.

## రాచరిక సంస్థానాలతో రాజీ

ఫ్యూడల్ సంస్థానాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగిస్తున్న అపూర్వమైన తిరుగుబాట్ల వెల్లువ బారి నుండి, ప్రజల కోపాగ్ని నుండి సంస్థానాధిపతులను రక్షించేందుకు గాను భారత బూర్జువా వర్గం వారితో తన రాజీ ప్రయత్నాలను మరింత త్వరితపరచింది. 1950 నాటికి పూర్వపు సంస్థానాధిపతుల భూభాగాలను వారి సామాజిక, ఆర్థిక హక్కులకు ఎట్టి తీవ్ర భంగం లేకుండా కలుపుకొన్నారు – గున్నార్ మిర్దాల్ తన “ఏషియన్ డ్రామా” గ్రంథంలో చక్కగా చెప్పినట్లుగా “దౌత్యం, బుజ్జగింపులు, చట్టబద్ధమైన లంచగొండితనం” లాంటివి సంస్థానాధిపతులు భారత యూనియన్‌లో చేరేలా ఒప్పించడానికి వినియోగపడ్డాయి. ప్రజాతంత్ర విప్లవ స్వభావంతో పొసగని రాజ బిరుదులు, రాజాభరణాలు, అసంఖ్యాకమైన పన్నుల నుండి మినహాయింపులు తదితర అనేక హక్కుల్ని కల్పించినారు. వీటికి తోడు వారిని విదేశీ రాయబారులుగా, రాష్ట్రాల గవర్నర్‌లుగా, ఐక్యరాజ్యసమితి సభ్యులుగా ఆకర్షణీయమైన పదవుల్లో నియమించారు. యథాతథ స్థితిని, పాత వ్యవస్థను కాపాడేందుకు ఫ్యూడల్ అధికార చిహ్నాలుగా వున్న వీరి ప్రత్యేక హక్కుల పట్ల ఉదారంగా వ్యవహరించడం, సామ్రాజ్యవాదంతో రాజీ కుదుర్చుకొని అధికారంలోకి ఎగబ్రాకడం యొక్క మౌలిక సారాంశమైంది.

## భూస్వామ్య వ్యవస్థతో రాజీ

భారత ప్రజలను మోసగించడానికి ఆడిన బూటకపు నాటకాల్లో జమీందారీ రద్దు మరొకటి. జమీందారులకు మరియు సంస్థానాధీశులకు కోట్లాది ఎకరాల భూమిని వదిలేసి, పెద్ద పెద్ద భవనాలను, కోటలను వారి స్వంత ఆస్తిగా పరిగణించడం, అంతేగాక జమీందారీ వ్యవస్థ రద్దు పేరుతో వారికి వందల కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించారు. ఖచ్చితంగా జమీందారీ రద్దు ప్రహసనం ద్వారా సామాజిక ఆర్థిక సంబంధాల్లో ఎటువంటి మౌలిక మార్పు ఉద్దేశించ బడలేదు. 1848 ఏప్రియల్‌లోనే మౌలికమైన ఎట్టి మార్పుకైనా తాను వ్యతిరేకమని రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించాడు. “ఈ చర్యలు తీసుకొనే సందర్భంగా ప్రస్తుతం వున్న నిర్మాణం మరీ ఎక్కువగా దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి. దీన్ని ఇంకెంత మాత్రమూ ధ్వంసం చేసే ధైర్య సాహసాలు నాకు లేవు” అని ఆయన రాజ్యాంగ సభలో ప్రకటించాడు. మన దేశపు మొట్టమొదటి ప్రధాని చేసిన ఈ మౌలిక ప్రకటన భారత బూర్జువా వర్గం, దాని ప్రతినిధులు సామ్రాజ్యవాదంతోనూ, ఫ్యూడలిజంతోనూ చేసుకున్న రాజీబేరాల ఒప్పందపు స్వభావాన్ని అత్యంత తేటతెల్లం చేస్తుంది. (తాకట్టులో భారతదేశం)

## విదేశీ పెట్టుబడితో అతినీచమైన ఒప్పందం

"రాజ్యాంగ సభలో ప్రభుత్వం తాను కామన్‌వెల్త్‌లో సభ్యురాలుగా వుండాలని నిర్ణయించుకుంది. దానితో లాహోర్ కాంగ్రెస్ ఆమోదించిన "సంపూర్ణ స్వరాజ్యం" అనే ప్రఖ్యాత తీర్మానం బుట్టదాఖలైంది. విదేశీ పెట్టుబడిని పూర్తిగా అంతం అవుతుందనే భయం తొలగింది. ప్రధాని నెహ్రూ 1948 ఫిబ్రవరి 17న "వీలైనంత వరకు ప్రస్తుత పరిశ్రమలను జాతీయం చేయడం జరగదు" అని ప్రకటించాడు. ఇది భారత ప్రజలను సంయుక్తంగా దోచుకొని అత్యధిక లాభాలు గడించడానికి విదేశీ పెట్టుబడితోనూ, అప్పటి దాని ప్రతినిధి అయిన బ్రిటిష్ ప్రభుత్వంతోనూ మిలాఖత్ అవుతామని మరొకసారి భారత బూర్జువా వర్గాలు స్పష్టంగా సూచించడమే"

## భారత సైన్యాన్ని పునర్నిర్మించడం

భారత ప్రభుత్వం సైనిక వ్యవస్థను బ్రిటిష్ వారి నుండి సంక్రమింపజేసుకుంది. "భారత సైనం బ్రిటిష్ సామ్రాజ్యవాదం సైన్యంలో అంతర్భాగంగా వుండింది. అందులో భారత సైన్యం రాజకీయాలకు దూరంగా వుంచబడి ప్రధానంగా సామ్రాజ్యవాద పాత్రను నెరవేర్చేదిగా తీర్చిదిద్దబడింది. అధికారుల విశ్వాసపాత్రత క్షుణ్ణంగా శోధించబడేది. వాళ్ళలో కొందరు బ్రిటిష్ పాలనలో లాభపడి అది కొనసాగడంలో స్వప్రయోజనాలను గుర్తెరిగారు. వాళ్ళలో అనేకులు పాశ్చాత్య భావాలు, సంస్కృతి, వేషధారణ, సాంఘిక అలవాట్లను స్వీయగతం చేసుకున్నారు." (Himalayan Blunder - బ్రిగేడియర్ జె.పి.డాల్వి, పేజీ 345) వలస పాలకులకు ప్రాణప్రదమైన భారతదేశంలో శాంతి భద్రతల స్థితిని గురించి కూడా వాళ్ళు ఆందోళన చెందారు.

ఆ విధంగా భారత సైన్యం భారత ప్రజల ప్రధాన జీవితం నుండి పూర్తిగా విడగొట్టబడి, జాతీయ లక్ష్యాలతో ఏ మాత్రం నిమిత్తం లేకుండా, ఉద్దేశ్యపూర్వకంగా రాజకీయ వాతావరణం నుండి దూరంగా వుంచబడి సామ్రాజ్యవాద ప్రయోజనాలకు తోడ్పడే కిరాయి సైన్యంగా మాత్రమే అభివృద్ధి చేయబడింది. బ్రిటిష్ వారి నుండి భారత ప్రభుత్వ వారసత్వంగా పొందిన సైన్యం అలాంటిది. ఈ జాతీయ వ్యతిరేక వారసత్వంతోపాటు భారత సైన్యం 1947 ఆగస్టు 15 తరవాత కూడా రెండు సంవత్సరాల పాటు బ్రిటిష్ సర్వసేనాని అయిన జనరల్ బోచర్ ఆధిపత్యం కిందనే వుంది.

రక్షణ సర్వీసుల విద్య సైతం వారి చేతుల్లోనే వుండి పోయింది. వెల్లింగ్టన్ వద్ద గల రక్షణ సర్వీసుల స్టాఫ్ కాలేజీ కూడా వారి ఆధీనంలోనే వుంది. 1950 అక్టోబర్‌లో "టిబెట్‌లోకి చైనా ప్రవేశించిదన్న వార్త వెలువడగానే" అప్పటి కమాండర్ జనరల్ డబ్ల్యూ.డి. ఎలాంట్సేన్ ప్రధాన తరగతి గదిలోకి దూసుకొనిపోయి అక్కడ ఉపన్యాసం ఇస్తున్న లెక్చరర్‌ను ఆపి చైనీయుల చర్య పట్ల భారత నాయకుల్లో దూరదృష్టి లేకపోవడాన్ని కార్యశూన్యతను ఖండించాడు" అని బ్రిగేడియర్ జె.సి.డాల్వి రాసాడు.

ఆ విధంగా భారత బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదులు కలిసి దోపిడీ చేయడానికి వీలుగా భారతదేశాన్ని పదిలపరచుకోవడం కోసం చేసుకొన్న అవమానకరమైన రాజీ ఒప్పందం మాత్రమే అధికార మార్పిడి.

బ్రిటన్ తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కొరకు తయారు చేసి అభివృద్ధి చేసుకున్న కిరాయి సైన్యాన్ని భారతదేశం వారసత్వంగా పొందినట్లే "దేశాన్ని సమర్ధవంతంగా పరిపాలించడానికి బ్రిటిష్ వారు సృష్టించిన పరిపాలనా యంత్రాంగాన్ని కూడా భారతదేశం పొందింది. నూతన భారత ప్రభుత్వం బ్రిటిష్ వారి నుండి గ్రామాధికారి మొదలు అత్యున్నత కార్యదర్శుల వరకు గల పాలనా యంత్రాంగాన్ని ఎట్టి మార్పు లేకుండా యధాతథంగా స్వీకరించింది". (తాకట్టులో భారతదేశం)

అంతిమంగా మొత్తంగా చూస్తే భారత ప్రజల విముక్తి పోరాటంలోని ఆఖరి ఘట్టంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారత బూర్జువా వర్గంతోనూ, భూస్వామ్య వర్గాలతోను రాజీ ఒప్పందం చేసుకొని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు సంపూర్ణంగా సంరక్షింపబడే విధంగా రహస్య ఒడంబడిక చేసుకొని రాజ్యాధికారాన్ని వారికి అప్పగించారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలనాధికారాన్ని విశ్వాస పాత్రులైన బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు అప్పజెప్పారని స్పష్టమైంది.

## ముగింపు

ఈ కింది వివిధ ప్రధాన అంశాలు ఈ అధ్యాయం ద్వారా వెల్లడైనాయి.

1. భారత ప్రజలు సాగించిన సుదీర్ఘ వీరోచిత విప్లవ స్వాతంత్ర్య పోరాటం ప్రభావం వల్ల, 2వ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారీ నష్టాలకు గురై బలహీనపడ్డం వల్లా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1947లో ఒక రహస్య ఒప్పందం ద్వారా భారత జాతీయ కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న; అత్యంత విధేయులు, విశ్వాసపాత్రులు అయిన భారత బూర్జువా వర్గాలతో రాజీపడి అధికార పగ్గాలను అప్పజెప్పవలసి వచ్చింది.
2. భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రతినిధిగా భారత ప్రజల వీరోచిత విప్లవ పోరాటాలను వమ్ముచేస్తూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో రాజీపడి ఒక రహస్య ఒప్పందం ద్వారా అధికారాన్ని కాజేసింది.
3. కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వం బ్రిటిష్ సామ్రాజ్య వాదులు తయారుచేసి అనుసరించిన రాజ్యాంగాన్నీ, పరిపాలనా నిబంధనలను, పద్ధతులను అనుసరించింది.

4. ఆర్థిక విధానానికి సంబంధించి కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వం భారత బడా బూర్జువావర్గం, బడా భూస్వామ్య వర్గం సామాజికార్థిక ప్రయోజనాలకు పూర్తి భద్రత కల్పిస్తూ వివిధ చట్టాలను నియమాలను ప్రవేశపెట్టింది. అదే విధంగా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కూడా సంరక్షించింది.

ఆ విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన భారత బూర్జువా వర్గం సాగించిన కార్యకలాపాలు మరియు కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వం చేపట్టిన తదనంతర చర్యలు – సామ్రాజ్య వాదులు రాజ్యాధికారాన్ని శిక్షణ పొందిన, విశ్వాసపాత్రులైన దళారీలకు మార్పిడి చేస్తారని అర్థ వలసలకు సంబంధించి కా॥ లెనిన్ చేసిన విశ్లేషణలను నిరూపించాయి. కావున భారతదేశానికి సంబంధించి ఈ అధ్యాయం మొదట్లో పేర్కొన్న అర్థవలస దేశము అను నిర్ధారణ పూర్తిగా సరైనదే అని నిరూపితమైంది.

*****